# బాపూ బొమ్మ - 7

పెళ్లి అనే బంధంతో అతనిపట్ల ఏర్పడిన రవ్వంత అనురక్తి కూడా అడుగంటిపోయింది! ఆ తర్వాత మాటల్లో రత్తాలు 'నాగమ్మ' అంది. ఆరోజు ఆయనకోసం వచ్చిన నాగసుందరినీ చూశాను. మా అత్తగారి మాటలతో విషయమూ నాకు నిర్ధరణ అయింది. ఇలాంటి విషయాల్లోనే అపోహలు ఉంటాయి... పుకార్లు షికార్లు చేస్తాయనే అనుమానం నా మనసులో ఎక్కడో కొద్దిగా ఉంది. కానీ అపుడు అది బహిరంగ రహస్యమని గ్రహించగలిగాను !

ఆ విషయం నన్ను ఎందుకోగానీ బాధించలేదు... ఆశ్చర్యానికి గురి చేసిందంతే! దానికి కారణం నా మనసు కాపురం మీద కంటే చదువుమీదే ఎక్కువగా నిమగ్నమై ఉండటంవల్లే అనుకుంటాను! పెళ్ళి నిశ్చయమయ్యాక కూడా, అతని గురించిన ఆలోచనలు చాలా చాలా తక్కువగానూ, ఏ సబ్జెక్టులో స్కూలు ఫస్టు మార్కులు వస్తాయి, ఎందులో తక్కువ వస్తాయో ఏ కాలేజిలో చేరితే బావుంటుందో... అలాంటి సలహా, సూచనలు అతను ఇస్తాడా... నా స్నేహితుల్లో ఎంతమంది కాలేజీ చదువుకి వస్తారో.. ఇలాంటి ఆలోచనలే ఎక్కువగా ఉండేవి మరి !

ఆ రోజు.. ఎందుకనో ఆయన ఇంటికి కొంచెం తొందరగానే చేరుకున్నారు. ఏ పని మీద ఎక్కడెక్కడ తిరుగుతున్నారో.. అందుకే, తనకి కనిపించలేదని కారణం తెలుసుకోవటానికి ఇంటికి వచ్చింది నాగసుందరి!

ఎందుకోగానీ... ఆమాట ఆయనకు చెప్పి అతని రియాక్షను ఎలా ఉంటుందో చూడాలనే సరదా పుట్టింది.

ఆ మాట నేను చెప్పగానే... నేననుకున్నట్లుగా అతను తడబడలేదు. పైగా చాలా ఆనందంగా "నిజంగా...?" అనడిగాడు.

అవును అన్నట్టుగా తలవూపాను.

అతని మొహంలోకి కాంతి వచ్చింది "నువ్వు చూశావా... ఎలా ఉంది...?" కళ్ళెగరేశాడు.

''మీ అభిరుచికి అద్దం పట్టినట్లుగా ఆ అమ్మాయి అలంకరణ ఉంది!"

ఏమిటో..మనసులోని మాటను నిస్సంకోచంగా చెప్పేశాను..!

''అంటే...? " మొహం చిట్లించి చూస్తూ అడిగిన ఆ ప్రశ్నకి, సమాధానం చెప్పలేదు. 'ఊరంత నోరు' అని అత్తగారు అన్నమాట ఆ క్షణంలో గుర్తుకు వచ్చింది. గయ్యాళితనానికి మారుపేరుగా ఆ మాట వాడుతూంటారు. మరి ఈయనగారు ఏమంటారోనని తెలుసుకోవాలనిపించింది.

''బాగా మాట్లాడుతుందా...?" యధాలాపంగా అడిగినట్లుగా అన్నాను.

''మాటల అవసరమే లేదు.. " అంటూ పకపక నవ్వాడు.. ''పక్కన నిలబడితే చాలు మల్లెపందిరిలా మత్తెక్కించేస్తుంది..!" స్వంతవాళ్ళ గురించి చెబుతున్నట్లుగా కళ్ళల్లో మెరుపు!

నాకు ఒళ్ళంతా కంపరంగా అనిపించింది.

"అవునూ.. నువ్వు చూశానంటున్నావ్... తనేమో నిన్ను చూడలేదందేమిటి...? " అనడిగాడు

అంటే... ఎక్కడికో వెళ్ళినవాడు ఇంటికి రావటానికి ముందే, ఆ సుందరిని కలిసి వచ్చాడన్నమాట ఎంత సిగ్గులేనితనం..! తప్పు చేస్తూ... అదో గొప్ప పని అన్నట్లుగా మాట్లాడటం...! ఏ మాత్రం వెరపు లేనేలేదు.

నేనూ నిర్భయంగానే సమాధానం చెప్పాను. ''మీఅమ్మగారు 'ఎందుకు వచ్చావు.. వెళ్ళంటూ 'అరుస్తుంటే... అభిమానం, రోషం లేకుండా వచ్చిందెవరా అని నేను లోపలి గదిలో నుండే చూశాను. నన్ను చూస్తానని అడగటం విన్నానుగానీ.. గబ్బిలాన్ని ఇంతకుముందు చూసే ఉంటుంది కదా, మళ్ళీ నన్ను ప్రత్యేకంగా చూసేదేముందిలే అనుకున్నాను. అవునూ.. మీరు నన్ను పల్లెటూరి

గబ్బిలాయిగా పరిచయం చేశారని అన్నది. గబ్బిలాలు ఎక్కడైనా ఒకలా ఉండవా..? పల్లెల్లో, పట్టణాల్లో వేరువేరుగా ఉంటాయా.. నాకు తెలియక అడుగుతున్నాలెండి.. మీరంతా ఈ ఊరు పల్లెటూరు కాదనుకుంటారుగా, ఇదేమైనా మహానగరమా...?"

నిజంగా తెలియనట్లే మొహం అమాయకంగా పెట్టి అడిగానేమో... ఆయనగారికి కోపం ఇంతెత్తున వచ్చి ఎగిరిపడినట్లుగా విసురుగా "ఇలాంటి తెలివితేటలు మాత్రం బాగానే ఉన్నట్లున్నాయ్..?" అన్నాడు.

"నిజమా...? క్లాసులో ఎప్పుడూ ఫస్టు మార్కులు తెచ్చుకుంటానని మా వాళ్ళంతా తెలివైనదని పొగుడుతుండేవాళ్ళు. కొంచెం ఎక్కువసేపు చదివితే ఏముందీ.. మార్కులు వస్తాయిగానీ తెలివి తేటలకు సంబంధం ఏం ఉండదనుకుంటూ... వాళ్ళ మాటలు నమ్మేదాన్ని కాదు.. కానీ.. ఇప్పుడు మీరు అన్నారు కాబట్టి... నమ్ముతున్నా..'' అన్నా.

" నా మాట మీద అంత నమ్మకం ఉందా...? " వ్యంగ్యంగా అన్నాడు.

"మనల్ని అభిమానించే వాళ్ళకు మనలోని మంచి గుణాలు కొంచెమే అయినా, గొప్పగా కనిపిస్తాయి. ఇష్టం లేనివాళ్ళు కూడా అదే మాట చెబితే, ఖచ్చితంగా నమ్మగలం కదా...? "

నేను రెచ్చగొడుతున్నట్లుగా అనిపించిందేమో, అతని కోపం నషాళానికి అంటినట్లుగా పెద్ద గొంతుతో అరిచాడు. ''ఎదురుచెప్పటం కాదు, కొంచెం కోపం మొహంలో కనుపించినా మా అమ్మ చెంప చెళ్ళు మనిపించేవాడట మానాన్న! అత్త, ఆడబిడ్డలు మొట్టికాయలు వేసినా కిక్కురు మనేది కాదట! మునుపు పిల్లలకు పెద్దవాళ్ళు అంతలా భయభక్తులు, పవిత్రధర్మాలు బోధించేవాళ్ళు! మీవాళ్ళూ ఉన్నారు... ఎందుకూ...!"

"సతీ ధర్మం అనేది కూడా ఒకటుంది! అది తెలియనివాళ్ళకు పతివ్రతాధర్మం గురించి మాట్లాడే హక్కు ఉండదనుకుంటానూ..." సూటిగా అతనివేపు చూస్తూ అన్నాను.

ఆ ఇంట్లో అడుగుపెట్టాక... అతను నాతో అంతసేపు మాట్లాడటమనేది అదే మొదటిసారి ! అదీ నా గురించి కాదు... ఆ నాగసుందరి గురించి ఆరా తీస్తూ...!

"ఇంతలా పొగరుమోతులా మాట్లాడినందుకు.. చెంపపగలగొట్టాలి..!"

"ఒకరిని మనసులో పెట్టుకుని.. మరొక అమ్మాయికి తాళి కట్టి శిక్షించినందుకు గాను రెండు చెంపలూ గట్టిగా వాయించుకోండి! నాకేం అభ్యంతరం లేదు! " విసురుగా తలుపులాగి బయటకు వచ్చేశాను !

ముందుగదిలోని కుర్చీలో కూలబడ్డాను.

మా అత్తగారు వచ్చి ఆయనతో ఏమన్నదో ఏమో గానీ... ఆయన పెద్ద గొంతుతో "వగరుపిందెను చేతిలో పెట్టి దోరకాయను వదులుకోమంటే... ఎవరు వింటారూ...? నీ నిర్వాకం అలాగే ఏడిసింది..! " అరవటం వినిపించింది.

వెంటనే ఆయన విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

అప్పుడు... నేను ఆ గదిలోకి అడుగుపెట్టాను. నా మంచాన్ని దూరంగా లాక్కుని పక్కమీద వాలాను. కళ్ళ నుండి ధారాపాతంగా కన్నీళ్ళు! తుడుచుకునే ప్రయత్నం కూడా చేయలేదు. కాసేపటికి ఒంట్లో నుండి వస్తున్నట్లనిపించిన సెగలు తగ్గి మనసూ కొంచెం నెమ్మదించి చల్లబడింది!

అవమానాలే తప్ప ఆ ఇంట్లో వాళ్ళ నుండి ప్రేమాభిమానాలను ఆశించకూడదని అర్థమైంది. అందుకు మనసును సన్నద్ధం చేసుకునే ప్రయత్నం మొదలుపెట్టాను!

★ ★ ★

ఆ విషయంగా అత్తగారు ఏమీ ప్రస్తావించకపోవటంతో నేనూ కొంచెం స్థిమితపడ్డా. రోజులు మామూలుగానే నడుస్తున్నాయి. ఏ మార్పు లేదు!

పెరటి గుమ్మం మెట్టుమీద కూర్చున్నాను.

జామ చెట్టు మీద వాలిన పక్షుల్ని నాగన్న అదిలిస్తుంటే చూసి ''ఎందుకలా చేస్తున్నావు'' అన్నాను. ''ఏవో ఒకటి రెండు కాయలు తింటే ఏమవుతుందీ..? మనం అసలు ఆ కాయల్నే కోయటం లేదుగా... ఆ పక్షులనయినా ఆనందంగా తిననీయి...'' అని కూడా చెప్పా.

ఇంటి ముందూ, పెరటిలోనూ చెట్లూ... ఆ చెట్ల మీద గుంపులుగా పక్షులూ ఉంటేనే అందం... ఆరోగ్యం అనేవారు నాన్న. పక్షుల కోసం నాన్నమ్మ ధాన్యపు కంకుల్ని ఇంటిముందుండే వసారా చూరుకు వేళ్ళాడదీస్తుంది!

''పిట్టల గోల పెద్దమ్మగారికి పడదండి... అందుకే అదే అలవాటయిపోద్దని... వాటిని అదిలించమంటారు. జామకాయలు కూడా పడవండి. ఒక్కటి కూడా తినరందుకే. చిట్టినాయుడుకి అమ్మేశారండి. ఆడు అపుడపుడూ వచ్చి చూసుకుంటూ కోసుకెళ్తాడండీ! మా బుడ్డోడి కోసం పైసలిచ్చి నాలుగు కాయలు ఇమ్మంటే... ఆడిది మా దొడ్డ మనసులెండి 'పోరా నీ కాడ నే పైసలు దీసుకుంటానా' అని కసిరి పదికాయలు చేతబెడతాడండీ! ఎర్రోడు వెధవ! " అంటూ అసలు సంగతినీ బయటపెట్టేశాడు!

తాను తినలేకపోతే మానె, పెరట్లో కాసిన జామకాయలు ఇరుగుపొరుగు పిల్లలకివ్వక, అవీ అమ్మటమేనా..? పనివాళ్ళకీ ఇవ్వకపోవటం.. ఛీ.. ఛీ.. అనిపించింది !

నేను చటుక్కున లేచి లోపలకు వెళ్ళి ఇన్ని గింజల్ని చిన్న చేటలాంటిదానిలో పోసి బయటకు తెచ్చాను "ఇలా పెరట్లో రోజూ పెట్టు నాగన్న... ఆ సత్తుగిన్నె ఉంది చూడూ,దానిలో నీళ్ళు కూడా ఓ పక్కగా పెట్టు. చక్కగా తిని ఎగిరిపోతాయి!'' అన్నాను.

అక్కడ ఆ గింజధాన్యాల్ని పెట్టానో, లేదో మా అత్తగారు విసురుగా వచ్చి రుసరుసలాడింది. ''ఏరా.. నీకు

పనిచేయటానికి జీతం ఇస్తున్నాగానీ.. పనికిమాలిన కబుర్లన్నీ అడిగినవీ, అడగనివీ కూడా చెప్పటానిక్కాదు!'' అంటూ ఉరిమి, ''ఇక్కడెవరూ తెచ్చి పోసిన రాశులేం లేవు.. ఆ చేట తీసుకెళ్ళి లోపల పెట్టు..!'' ఆర్డరు కూడా జారీ చేసింది!

దిక్కుతోచనట్లుగా చూస్తున్న నాగన్నని ''చెప్పింది చేయి.. వినబడలేదా..?'' అంటూ గదమాయించేసరికి వాడు దాన్ని పట్టుకుని లోపలకు పరుగెత్తాడు.

నేను నిర్ఘాంతపోయి అలాగే నిలబడిపోయాను!

ప్రతిరోజూ అష్టోత్తరంలా ఎంతటి ఆస్తిపాస్తులకి నేను స్వంతదారునయ్యానో వివరంగా చదివే అత్తగారు పిడికెడు గింజలు పిట్టలకి పెట్టే హక్కూ నాకు లేదని తేల్చి చెప్పేసింది!

పక్షులకైనా గింజ విదల్చక, చెట్టుకాయ అయినా ఎవరికీ పంచక.. అంతా సొమ్ము చేసుకుని... ఏం చేసుకోవటానికి? ఆదాకీ ఓ పరిమితి ఉండదా..?

కేవలం దాచిపెట్టుకోవటంలోనే ఆవిడకు ఆనందం కలుగుతుందా..?

అంతకుమించి ఇంకే విషయం పట్లా ఆసక్తి కూడా లేకపోవటం నిజంగా విచిత్రమే! అందుకేనేమో డబ్బుని సంపాదించటం కంటే దానిని సద్వినియోగపరచటమే కష్టమని అంటారు!

అత్తగారు ఆయనకు సంపాదించాల్సిన అవసరం లేదనుకుంటుంది. సంవత్సరాల తరబడి కూడబెట్టిన ఆస్తినయినా తగలెయ్యటానికి ఎంతో కాలం పట్టదని ఆవిడ తెలుసుకోవటం లేదు. ప్రస్తుతానికి విసుక్కుంటూ అయినా అడిగినంత ఇస్తోంది, కాబట్టి ఆయనా తల్లి మాటల్ని లెక్కచేయటం లేదు. పని జరుగుతోంది కదా! డబ్బు ఇవ్వటం ఆపితే, ఆవిడ పెత్తనాన్నీ తన చేతిలోకి తీసుకుంటాడు! ఆ తర్వాత ఈ ఆస్తులన్నీ మాయం కావటానికి ఎంతో కాలం పట్టదని నాకనిపించింది!

పిల్లలకు పెద్దవాళ్ళు బరువు బాధ్యతల్ని తెలియజేయకపోవటం కూడా నేరమే! అది గారం అని భ్రమపడుతుంటారు!

అమ్మా వాళ్ళంతా గుర్తుకొచ్చారు... నన్ను పదే పదే తలుచుకుంటున్నారా...? నేనిక్కడ హాయిగా ఉన్నాననుకుంటారు! అలాంటి భ్రమలో సంతోషంగా ఉండటమే మంచిది! ఈ ఇంట్లో నా పరిస్థితి తెలిసి మాత్రం ఏ చేయగలరూ..!

పక్క వీధిలో ఉండే అత్తగారి బంధువులట.. కామేశ్వరమ్మ అనే ఆవిడ తన మనవరాల్ని తీసుకుని వచ్చింది. కోడలికి సీమంతం చేస్తున్నామంటూ పేరంటం పిలవటానికి. మా అత్తగారు అలాంటివాటికి వెళ్ళే అలవాటు లేదు కాబట్టి ఎవరూ పిలవను కూడా పిలవరట. ఇప్పుడు నేనున్నాను కాబట్టి పిలవటానికి వచ్చానని అందావిడ.

''మా కోడలుకీ ఎక్కడికీ కదిలే అలవాటులేదు. ఎప్పుడూ ఏదో పుస్తకాలు తిరగేస్తూ ఉంటుంది..'' అని నన్నడక్కుండానే నేను రాననే విషయాన్ని ఆవిడకు అత్తగారే చెప్పేసింది.

నేను మాత్రం ఏమనగలను..?

''ఏమో.. వచ్చినా రాకపోయినా బొట్టుపెట్టి పిలవటం నా ధర్మం కదా! ఇన్నాళ్ళూ సరే, ఇప్పుడు కోడలు వచ్చిందనీ..'' అంటూ ఆవిడ నాకు బొట్టుపెడుతున్నపుడు ''మీ ఊళ్ళోనూ మాకిద్దరు ముగ్గురు బంధువులున్నారు. వాళ్ళని పిలవటానికి వెళ్ళినపుడు మీ ఇంటికీ ఓ అడుగువేసి నువ్వు బాగానే ఉన్నావని చెబుతాలే...'' నవ్వు మొహంతో చాలా మెల్లగా చెప్పింది.

నేనే మా ఇంటికి వెళ్తున్నట్లుగా నాకు చాలా సంతోషమేసింది.

ఆవిడ పాదాలకు చటుక్కున ఒంగి నమస్కరించాను. ఆవిడ తలమీద చేయివేసి ఆశీర్వదిస్తున్నట్లుగా అని ఆ తర్వాత ''ఓర్చుకున్నమ్మకి తేటనీరు దక్కుతుందని పెద్దలు అన్నారు. ధైర్యంగా ఉండమ్మా...!''నాకు మాత్రమే వినిపించేట్లు మెల్లగా అంది.

ఆవిడ వెళ్ళిపోయింది. మా అత్తగారు ఆవిడ రావటం గురించి కాబోలు ఏదో గొణుక్కుంది. నేను పట్టించుకోలేదు. నడుం వాల్చటానికి తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆ ఇంటికి వచ్చిన పదో, పదిహేను రోజులకో ఓ సారి మా అత్తగారిని ''ఇక్కడ పోస్టాఫీసు దగ్గరేనా, మా ఇంటికి ఉత్తరం రాయటానికి కవర్లు తెప్పించుకోవాలి. నాగన్న తీసుకువస్తాడుగా..?'' అనడిగాను.

ఆవిడ నావేపు విచిత్రంగా చూసి ''ఉత్తరం రాయాలా...? ముంచుకుపోయిన వార్తలేం ఉన్నాయనీ? ఎవరూ మంచంపట్టి లేరుగా, చూచివెళ్ళండని చెప్పటానికి! పోచికోలు కబుర్లు చెప్పుకోవటం, ఉత్తరాలు రాసుకోవటం లాంటి అలవాట్లు మా ఇంటావంటా లేవు! కబుర్లేం ఉన్నాయో దాచిపెట్టు... కలిసినపుడు కుండలకొద్దీ కుమ్మరించుకోవచ్చు!'' ఈసడింపుగా అనేసరికి బిత్తరపోయాను.

ఉత్తరాల ద్వారానైనా పలుకరించవచ్చనే ఆశ కూడా అడుగంటిపోయింది! శకుంతలక్కకీ, సుజాతకీ కూడా సరదాగా ఉత్తరాలు రాయొచ్చనుకున్నా. అదికుదరదనే విషయం తెలిసి నిర్ఘాంతపోయాను.

అంతలోనే ఇంకొక వార్తా ఆశ్చర్యంగా తెలిసింది... సరిగ్గా నేను ఉత్తరాల గురించి అనుకుంటున్నపుడే.

రత్తాలు వచ్చి ఒక కాగితం ముక్క నా చేతిలో పెట్టింది.

''మొన్నామధ్య... మన పోస్ట్ మేన్, అమ్మగారికి ఏదో కవరే కాబోలు ఇచ్చాడమ్మా. ''ఎక్కడనుండీ?'' అని అతన్ని పెద్దమ్మగోరడిగి వెంటనే చింపి పారేసారు. ఈ ఇంటికి ఉత్తరాలే రావు. ఏదో కార్డు ముక్క దినం కబురుతో వస్తుంటుందంతే. పోస్టాయనతో చదివి చెప్పించుకుని అక్కడే చింపిపారేయటం అలవాటుగదా.. అదీ అలాంటిదే అయివుంటుందనుకున్నానమ్మా.

ఈయాళా పెద్దమ్మగోరు అలా చించిపారేసారు. పైగా చెంగునుండి ముడివిప్పి ఎంతో డబ్బు ఇచ్చారా పోస్టాయనకి. చావు కబురైతే, కార్డు వస్తదిగానీ, అంత పెద్ద జాబు రాయరుగా అని అనుమానం వచ్చి.. ఇదిగో.. ఇది తెచ్చా... మీకు తెలుస్తాదేమోనని...'' అంది.

అత్తగారు గదిలో ఉందనే ధైర్యంతో అదంతా రహస్యంలా చెప్పగలిగింది.

నా చేతిలో ఉన్న ఆ కాగితాన్ని కొంచెం సాపుచేసి చూశా. అది శకుంతలక్క రాసిన ఉత్తరమని అర్థమైంది!

కవరు విప్పకుండానే పోస్ట్‌మాన్ అది నాకని చెప్పగానే చించిపారేసిందన్నమాట! అది శకుంతల చేతిరాతే!

కన్నీళ్ళు ఉబికి వచ్చాయి! ఉత్తరం రాసి, సమాధానం రాయలేదని మళ్ళీ రాసిందన్నమాట! ఉత్తరం రాయటానికి లేదు, వచ్చిన ఉత్తరాన్ని నా చేతికి ఇస్తే ఏం..? కోడలి పట్ల ఇంత అకారణ ద్వేషం కూడా ఉంటుందా?

ఉత్తరానికి సమాధానం రహస్యంగా అయినా రాస్తానేమోనని, రత్తాలుతో గానీ పోస్టు చేయిస్తానేమోననే అనుమానం కూడా ఉంది కాబోలు:

నా పరిస్థితి నాకే విచిత్రంగా ఉంది!

పంజరంలో చిక్కడినట్లే ఈ ఇంట్లో ఉంటున్నాను. అయితే తలుపులు తెరిచే ఉన్నా...ఎగరలేని నిస్సహాయ పరిస్థితి!

పరువు, మర్యాద అనే కనిపించని సంకెళ్ళు నన్నుకట్టడి చేస్తున్నాయ్!

అవును... ఇదే సరైంది! ఉత్తరం రాస్తే.. నిజాలు తెలియజేసి వాళ్ళను బాదపెట్టలేను! అలాగని భ్రమలు కల్పించే అసత్యాలు రాయటానికీ ఇష్టం ఉండదు!

ఇపుడేమో.. నా మనసులోని మాటలను అక్షరాలతో పేరుస్తూ.. కాగితాలతో చెప్పుకోగలగుతున్నాను! కాగితాలమీద నా బరువును కుమ్మరించేసి మనసును తేలికపరుచుకుంటున్న అనుభూతి! కనీసం ఈ విధంగానైనా చేయగలుగుతున్నాను!

అప్రయత్నంగా శకుంతల మాటలు గుర్తుకొచ్చాయి!

'ఏం చెప్పిందీ... కొంచెం అనునయంగా అడిగితే, ఆనవాయితీ ఆచారం ఏం లేదంటూ అమ్మకి నచ్చచెప్పి నన్ను వెంటబెట్టుకుని మా ఊరుకు తీసుకువెళ్తాడా...?' అనుబంధం అంటూ ఉంటే, ఆ మంత్రం ఫలితం ఇస్తుందేమోగానీ, ఇక్కడ అలా కుదరదు!

అత్తలు, భర్తలు అందరూ ఒకేలా ఉండరు... రకరకాల మనస్తత్త్వాలు! ఈసారి కలిసినపుడు ఈ విషయాన్ని తనికి చెప్పాలి! అసలు కలుసుకోవటమంటూ జరుగుతుందా...? జరిగితే ఎప్పటికి...? అప్పటివరకూ అక్క అచ్చట్లుముచ్చట్లతో నాకే తీరిక దొరక్క సమాధానం రాయలేదని అనుకుంటుందేమో..! అక్క అనుభవం అలాంటిది కాబట్టి అలా అనుకునే అవకాశమే ఉంది! నేను లంకంత కొంపలాంటి జైల్లో బందీ లా... నిష్కారణంగా శిక్ష అనుభవిస్తున్నానని ఊహించనైనా ఊహించలేదు!

నేను కూడా అంతేగా, ఇక్కడికి వచ్చే వరకూ నా జీవితం ఎలా ఉంటుందని ఎన్ని రకాలుగా ఊహించానూ...?

ఉదయాన్నే లేచి అత్తగారు లేచేటప్పటికే తన పనులన్నీ ముగించేసుకుని 'నువ్వు కాలేజికి వెళ్ళు... ఈ పనులన్నీ మేం చేసుకుంటాంగా' అన్నా సరే, వంటపనుల్లో, ఇంటి పనుల్లో సాయం చేసి, ఏదో ఇంత పెరుగున్నమో, పండో బాక్సులో సర్దేసుకుని హడావుడిగా బస్‌స్టాండ్‌కి వెళ్ళి... బస్సులో కూర్చున్నాక, ఆ

కాసేపూ పుస్తకాలు తిరగేస్తూ కాలక్షేపం చేయొచ్చు!

ఇక సాయంకాలం ఇంటికి వచ్చాక...' అలసిపోయినట్లు తోటకూరకాడలా వేళ్ళాడిపోతున్నావు... విశ్రాంతిగా కాసేపు కూర్చో...' అని అత్తగారన్నా, హుషారుగా ఆవిడకు చేదోడు వాదోడుగా పనుల్లో సాయం చేశాకనే పుస్తకాలు తీసి పాఠాలు చదువుకునే పనిమొదలు పెట్టాలి. పుట్టింట్లో మాదిరిగా కేవలం చదువుతోనే పొద్దుపుచ్చకుండా పనుల్లోనూ సాయం చేయాలి! నా చదువువల్ల ఎవరికీ ఇబ్బంది కలగనివ్వకూడదు!

అక్కడనుండి కూడా ఎవరైనా అమ్మాయిలు కాలేజికి వెళ్ళే వాళ్ళుంటే, వాళ్ళతో పరిచయం పెంచుకోవాలి! అపుడు చక్కగా పక్కపక్కనే బస్సులో కూర్చుని పాఠాల గురించీ, కాలేజి కబుర్లూ చెప్పుకుంటే ప్రయాణం చేసినట్లే అనిపించదు!

హైస్కూల్లో మాదిరిగానే కాలేజీలో కూడా మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకోగలగాలి! వ్యాసరచన, వకృత్త్వ పోటీల్లో పాల్గొని బహుమతులూ స్వంతం చేసుకోగలగాలి! బాబాయ్ చదువుకునే రోజుల్లోనూ, ఆ తరువాత ఉద్యోగంలో చేరాకనూ పట్నం నుండి ఇంటికి ఎప్పుడు వచ్చినా పిల్లలందరికీ ఒకటే సందడి!

పెదనాన్నల పిల్లలు నలుగురు, నేను మాత్రమే కాకుండా మా వీధిలోని కుటుంబాల్లో పిల్లలు ఇంకో నలుగురైదుగురు కూడా చేరుతూండే వాళ్ళు.

బాబాయ్ మా అందరికీ ఎన్నో రకరకాల పోటీలు పెట్టటం, చిన్న చిన్న బహుమతులు ఇవ్వటం రివాజుగా ఉండేది! ఏవో టాపిక్స్ ఇచ్చి– ఎలా మాట్లాడాలో బాబాయే నేర్పించి, తరవాత పోటీలు పెట్టేవాడు!

వ్యాసరచన, పాటల పోటీల్లో నాకే ప్రథమ బహుమతి వచ్చేది! వకృత్త్వ పోటీలో మాత్రం ఎప్పుడూ శకుంతలక్క ఫస్టు వచ్చేది! రవి, రాజులకు సెకండ్ బహుమతి దక్కేది! తనకేమీ రావటం లేదని సుజాత అలిగిందని, బాబాయ్ ప్రత్యేక బహుమతి అంటూ ప్రకటించి, ఇచ్చి తనకీ సంతోషం కలిగించేవాడు. ఆరోజుల్లో... శకుంతలని మాత్రం అక్క అని పిలుస్తూ, తనని కేవలం పేరుతోనే పిలుస్తున్నానని సుజాత పోట్లాడేది కూడా! ఎందుకో అలా అలవాటయిపోయింది!

ఆ రోజులు... ఆ అల్లరి.. సరదా పోట్లాటలు ఎపుడు గుర్తుచేసుకున్నా ఎంత అనందమో ! బాబాయ్ బహుమతులుగా ఇచ్చే కథల పుస్తకాలు, రిబ్బన్లు, బంతులు, బ్యాట్‌లు చాలా భద్రంగా, ఆనందంగా దాచుకుని మురిసోయేవాళ్ళం!

పెళ్ళయినా కూడా అలా కాలేజీకి వెళ్ళివస్తూ చదువుకునే రోజుల్లోని ఆనందాన్ని దూరం చేసుకోనని అనుకున్నాను! చదువుకోవాలనే నా కోరికకు ఆమోదాన్ని తెలిపిన అత్తకీ,ఆయనకూ చదువులో బెస్ట్ అనిపించుకుని ఆనందాన్ని కలిగించాలనీ అనుకున్నా ! కానీ జరిగిందేమిటీ...?

పంజరంలో బంధింపబడిన పక్షి ఏమరుపాటున ఎవరైనా తలుపులు తెరిస్తే, రివ్వున ఎగిరిపోతుంది! కానీ..నేను మాత్రం... తలుపులు తీసే ఉన్నా ఎగిరిపోలేని నిస్సహాయురాలిని! నువ్వెలా ఎగరగలవని నన్ను కవ్విస్తున్న జైలు అధికారులు అత్తగారు, ఆయనగారు ! తడిబారిన కళ్ళను తుడుచుకుని మనసును స్థిమితపరుచుకోవటమే నేను చేయగలిగింది!

★ ★ ★

ఎవరో తలుపు తట్టిన శబ్దం విని నే వెళ్ళబోతుంటే, 'నే చూస్తానుండు' అంటూ అత్తగారే వెళ్ళింది.

దూరంగా వెనకే నిలబడిపోయా.

తలుపు తీసిన అత్తగారు 'ఎవరూ' అన్నట్లుగా చూస్తుంటే అతను చెప్పటం నాకు వినిపించింది.

అతన్ని నేను గుర్తుపట్టాను. మా పొలం కొంత కౌలుకు తీసుకున్న రాఘవయ్య. మా ఊరు మనిషిని చూసినా నాకంత ఆనందం కలుగుతుందని నాకూ అప్పటి వరకూ తెలియదు!

దూరంగా నిలబడి ఉన్న నన్ను చూసి ''బాగున్నావా అమ్మా...'' అంటూ పలకరించి మా అత్తగారితో చెప్పాడు " నేనీవూరు పనిమీద వస్తోంటే,బుల్లెమ్మాయి నాన్నగారు మిమ్మలన్నందర్నీ పండక్కి పిలవటానికి రేపు వస్తున్నారని ముందుగా మీకీ కబురు చెప్పమన్నారండీ...!"

నాకు సంతోషంతో కాళ్ళు నేల మీద ఆనలేదు! గాల్లో ఎగురుతున్నట్లుగానే పెరట్లోకి వచ్చి... రాఘవయ్య పిల్లలకి జామకాయలు ఇచ్చి పంపుదామని నాగన్నను కోయమని చెప్పా. ఆ తరువాత అలా పెత్తనం తీసుకున్నందుకు నన్ను సాధించినా సరే, భరిద్దామని అనుకున్నా. భోజనానికీ ఉండమనీ చెప్పాలని అనుకున్నా. అతనిముందు అత్తగారేం కాదనలేదనే ధీమా కలిగింది.

నేను హడావుడిగా మళ్ళీ వచ్చేసరికి తలుపులు మూసేసి ఉన్నాయి. అత్తగారు ముందుగదిలో కుర్చీలో కూర్చుని ఉంది.

''రాఘవయ్య ఏడీ...?" అంటూ మా అత్తగారివేపు విస్మయంగా చూసాను. "కబురు చెప్పటానికి వచ్చిన మనిషి ఎంతసేపు ఉంటాడేం..?" నిదానంగా అంది. నేనలాగే చూస్తోంటే ఒక నిముషం ఆగి మళ్ళీ "మీ ఊరు... కరువుకాటకాలకి పేరు. అక్కడ పండగలేం గొప్పగా ఉంటాయిలే.. ! " నిర్లిప్తంగా అంది.

★ ★ ★